క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో విద్యార్థులు

నరసాపురం: నరసాపురం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. తరువాత కథలు చెప్పడం, యోగా నేర్పించారు. ఈ సందర్భంగా నరసాపురం గ్రేడ్-1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి మాట్లాడుతూ వచ్చే నెల 5 వరకూ ఈ శిక్షణా కార్యక్రమం సాగుతుందని చెప్పారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అలాగే విద్యార్థులకు కథల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాసిన కథలు ఈ నెల 30లోపు క్యాంపులో అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ రెడ్డప్ప ధవేజీ, సుధీర్ మోహన్, భట్టిప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



హైపర్ టెన్షన్ డే అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా జిల్లాలోని పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. రక్తపోటును నియంత్రించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖఅధికారిని డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ ప్రజలు ఎండ తీవ్రతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని వడదెబ్బ తగిలిన వ్యక్తికి వైద్య సిబ్బంది ఆసుపత్రి వద్ద అందుబాటులో ఉంటూ వైద్య సహాయం త్వరగా అందేటట్టు చూడాలని కోరారు. ఓఆర్ఎస్ ద్రావణం లేదా నీటిని తాగించాలని తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనలక్ష్మి, సిబ్బంది సుభాష్ పి.కనకప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల



రెండో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

యలమంచిలి: పాలకొల్లు శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల రెండో సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ చివరి, మే మొదటి వారంలో రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. రెండో సెమిస్టర్‌లో మొత్తం 213 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 71 శాతంతో 151 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆమె అభినందించారు. విద్యార్థులు తమ ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో చూడవచ్చని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎగ్జామినేషన్ కంట్రోలర్ టి.కృష్ణ, పరీక్షల కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశాలు పెంచాలి



పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సాంఘిక, సాధికారిత అధికారి బీవీవీఎస్ రామాంజనేయరాజు అన్నారు. శనివారం పెనుగొండ మండల పరిషత్ కార్యాలయంలో పెనుగొండ, ఆచంట, ఇరగవరం, పెనుమంట్ర మండలాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. వాటిని అందరూ సద్వినియోగం చేసుకొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. గ్రామాల వారీగా వసతి గృహ అవసరం ఉన్న విద్యార్థుల వివరాలు సేకరించాలన్నారు. డ్రాప్ అవుట్స్‌ను గుర్తించి వారిని వసతి గృహాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో తణుకు సహాయ సాంఘిక సంక్షేమాధికారి పి.నాగ సాయమ్మ, మండల సమన్వయ అధికారులు జి.ఫణికుమార్, కేవీ నర్సమ్మ, వై.అరుణ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి ఎగుమతులతో భయం.. భయం

- రోడ్ల మీదనే లోడు చేస్తున్న వైనం
- ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికుల అవస్థలు



యలమంచిలిలో రోడ్డు మీద ట్రాక్టర్ నిలిపి కొబ్బరికాయలు ఎగుమతి చేస్తున్న దృశ్యం

యలమంచిలి: వాహనాల రద్దీ, గతుకులు, ఇరుకు రోడ్లతో సతమతమవున్న ప్రజానికానికి భారీ లోడుతో వెళుతున్న కొబ్బరిలోడు లారీలు అనునిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా మేడపాడు నుంచి మండల కేంద్రం యలమంచిలి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో పదుల సంఖ్యలో కొబ్బరికాయ దుకాణాలు ఉన్నాయి. ప్రతి రోజూ ఇక్కడ నుంచి పదుల సంఖ్యలో కొబ్బరికాయ ఎగుమతి చేసుకుని లారీలు ఇతర రాష్ట్రాలకు వెళుతుంటాయి. కొబ్బరికాయలు లారీలోనికి ఎగుమతి చేసే సమయంలో రోడ్డు మీదనే వాహనం నిలిపి ఎగుమతి చేస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుకై ప్రతి రోజూ ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. ఒక్కోసారి లారీలకు ఏదైనా సాంకేతిక లోపం ఏర్పడితే రోడ్డు మీదనే నిలిచిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


క్రాస్ చేయాలంటే నరకమే

ఇరుకు రోడ్డు కావడంతో కొబ్బరి లోడుతో లారీ వెళుతున్న సమయంలో దానిని తప్పించాలంటే సుదీర్ఘ సమయం ప్రయాణించిన తరువాత ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే అధిక లోడుతో వెళుతున్న వాహనాన్ని అధిగమించాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక టన్నులతో ప్రతి రోజూ ఉదయం వేళల్లో పదుల సంఖ్యలో లారీలు ప్రయాణించడం వల్ల వాహనదారులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. అధిక లోడును నివారించాల్సిన ఆర్‌టీఓ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రవాణా శాఖ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. కొబ్బరి కా రవాణా చేసే లారీ యజమానులకు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

కాలం చెల్లిన వాహనాలతో సమస్య

కొబ్బరి లారీల్లో చాలా శాతం కాలం చెల్లినవే ఉండడంతో వాటి ద్వారా వచ్చే పొగ వల్ల కూడా ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. అలాగే ప్రతి రోజూ ఉదయం సాయంత్రం ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల బస్సులు కూడా పదుల సంఖ్యలో తిరుగుతున్నాయి. అయితే వాటిలో చాలా వాహనాలు కాలం చెల్లిపోవడంతో పొగ కక్కుకుంటూ వెళ్తున్నాయి. దీంతో ఆ వాహనాల వెనుక వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలం చెల్లిన వాహనాలు రోడ్లపై తిరగకుండా కఠిన చర్యలు తీసుకుంటే పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని పర్యావరణవేత్తల చెబుతున్నారు. అలాగే అధిక లోడు వాహనాల ప్రయాణం నివారిస్తే ప్రమాదాలు తగ్గడంతో పాటు వాహనదారులకు ప్రయాణం సులభతరం అవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు.

ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న



భక్తులకు దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామ పరిధిలోని కాపులకొడపలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని శనివారం ప్రత్యేంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారి సేవలో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం



నరసాపురం రూరల్: మొక్కలు నాటుతున్న ఆర్డీఓ దాసి రాజు



పెనుమంట్ర: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

నరసాపురం రూరల్: పరిసరాల పరిశుభ్రత విషయంలో మెరుగైన ఫలితాలు కనిపిస్తే ప్రజలు మంచి ఆరోగ్యం పొందుతారని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. శనివారం మండలంలోని రుస్తుంబాధ పంచాయతీలో ఆర్డీఓ దాసిరాజు మొక్కలు నాటారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. సర్పంచ్ బందెల భారతి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆర్డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని అన్ని చోట్ల నిర్వహించాలని, పరిశుభ్రత వల్ల అనేక రకాల అంటూ వ్యాధులకు దూరంగా ఉండవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం చలివేంద్రాన్ని ఆర్డీవో ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయితం వీరవెంకటసత్యనారాయణ, ఎంపీడీఓ రామకృష్ణంరాజు, బందెల రవీంద్ర, వట్టిప్రోలు సతీష్, డొల్ల జగన్, యడ్లపల్లి కాశీ అన్నపూర్ణ, గాది రవి తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్

పెనుమంట్ర: స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పెనుమంట్ర గరువు గ్రామంలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ముందుగా పెనుమంట్ర గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో ఎంఎస్ ప్రభాకరరావు, తహసీల్దార్ వై రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజారోగ్య పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ రామారావు, పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి



యలమంచిలి: కుమ్మరపాలెంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు



పెనుగొండ: ఆచంటలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: తల్లిదండ్రులంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పి ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ఇలపకుర్రు పంచాయతీ కుమ్మరపాలెంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించమని కోరుతూ శనివారం ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు కలసి ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోను నాణ్యమైన విద్య, వసతులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం ఇలా అనేక వసతులు ఉచితంగా లభిస్తున్నాయన్నారు. అన్నింటికీ మించి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తారన్నారు. కాబట్టి తల్లిదండ్రులు మంచిగా ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. కార్యక్రమంలో కుడకా ప్రసాద్, సానబోయిన శ్రీనివాస్, వాస్కూరి పరమేశ్వరరావు, నేదునూరి నరసింహారావు, హెచ్‌ఎం కేబీటీ సుందరి , సిబ్బంది వాస్కూరి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: బడి బయట స్కూలు వయస్సు ఉన్న ప్రత్యేక దివ్యాంగులు ఎవరూ ఉండకూడదని, ఎవరైనా ఉంటే వారిని దగ్గరలో ఉన్న పాఠశాల్లో చేర్పించాలని ఆచంట ఎంఈవోలు ఎ.ఉషారాణి, పి.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం ఆచంట మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. దివ్యాంగులకు భౌతిక కేంద్రాలు ద్వారా సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. గుర్తింపు కార్యక్రమం ప్రారంభమైందని, జూన్ 9 వరకూ కొనసాగుతుందన్నారు. దివ్యాంగులకు భవిత కేంద్రాలు ద్వారా సమగ్ర శిక్ష ప్రాజెక్టులో వారికి అవసరమైన ఉచిత ఉపకరణాలు, అలవెన్సులు, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, వ్యాయామం, ఇంటి దగ్గర విద్య, ఉచితంగా టీచింగ్ లెర్నర్ మెటీరియల్, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్, వృత్తి విద్యా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. అదే విధంగా సాధారణ పాఠశాలలో భౌతిక అడ్డంకులు లేని రెయిలింగ్ ర్యాంపులు, టాయిలెట్స్ నిర్మాణాలు చేపడుతన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు, ఎస్ఎంపీ గణేష్, ఎంఆర్‌పీ స్టాఫ్ సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మెరైన్ పోలీసుల పల్లెనిద్ర

నరసాపురం రూరల్: తీరప్రాంత గ్రామస్తులకు క్రైమ్ పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు మెరైన్ పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం మొగల్తూరు మండలంలోని తీర ప్రాంతమైన కేపీ పాలెం సౌత్‌లో అంతర్వేది మెరైన్ స్టేషన్ ఎస్సై సోమశేఖర్ రెడ్డి సిబ్బందితో కలిసి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి బస చేసి వారికి తీవ్రవాదులు, దేశ వ్యతిరేక శక్తుల ప్రమాదాలను వివరించారు. దేశ సమగ్రతను పెంపొందించేలా అవగాహన కల్పించారు. అనుమానిత వ్యక్తులు తారసపడినా, నిషేధిత మాదక ద్రవ్యాలు తీరం వెంబడి రవాణా చేసినా 1093కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



కేపీ పాలెంలో పల్లె నిద్ర చేస్తున్న ఎస్సై సోమశేఖర్‌రెడ్డి

అప్పుల ఊబిలో రాష్ట్రం.. పాలనలో చంద్రబాబు విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత

యలమంచిలి: రాష్ట్రం అప్పుల ఊబిలో మునిగిపోయిందని కాగ్ రిపోర్టు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత డిమాండ్ చేశారు. పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించి అధికారంలోనికి వచ్చిన ఏడాది తర్వాత కూడా వాటిని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె విమర్శించారు. సంపద సృష్టించి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఏడాది పాలనలో ఎంత సంపద సృష్టించారో ప్రజలకు వివరించాలని ఆమె డిమాండ్ చేశారు. సంపద సృష్టించడం మాట అటుంచి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని కాగ్ నివేదికలో బయటపడడం ప్రభుత్వ పనితీరును అద్దం పడుతుందని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్ పార్టీ సీనియర్ నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లికార్జునుడు, పసుపులేటి కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని దినాలు కల్పించాలి



పెనుమంట్రలో నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

పెనుమంట్ర: మండలంలో పెనుమంట్ర, పాలమూరు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూలీలకు తక్షణమే చట్ట ప్రకారం వంద రోజులు పని దినాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలో పెనుమంట్ర, పాలమూరు గ్రామాల్లో పని ప్రదేశంలో పని చేస్తున్న కూలీలను కలుసుకోవడంతో వారు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలో పెనుమంట్ర గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహించే యుక్త ధార యాప్ ఎంపిక అవ్వడం వల్ల ఉపాధి హామీ పనులు అనుమతులు ఇప్పటివరకు రాకపోవడం వల్ల కూలీలకు పని లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా డెల్టా ప్రాంతం రెండు పంటలు వ్యవసాయానికి అనువైనది కాబట్టి మే నెలలో పనులు కల్పించకపోతే మరో సంవత్సరం మే నెలలో 2026 వరకు ఆగాల్సి ఉంటుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు మరింత చేరువలో తపాలా బ్యాంకింగ్



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సూపరింటెండెంట్ కె.హరికృష్ణ ప్రసాద్

పెనుమంట్ర: కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా గ్రామీణ ప్రజలకు తపాలా సేవలతో పాటు బ్యాంకింగ్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు భీమవరం డివిజన్ తపాలాశాఖ సీనియర్ సూపరింటెండెంట్ కె.హరి కృష్ణ ప్రసాద్ అన్నారు. శనివారం పెనుమంట్రలో దాట్ల భవనంలో నిర్వహించయిన తణుకు సబ్ డివిజన్ తపాలా ఉద్యోగుల అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తపాలాశాఖ ద్వారా పొదుపు పథకాలతో పాటు పూర్వపు మనీ ఆర్డర్, ఉత్తరాలు రిజిస్ట్రేషన్ వంటి సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి గ్రామంలో ఎన్ఆర్‌జీఎస్ కూలీల కోసం ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా వారి కుటుంబాల్లో ఆపదకాలంలో ఆదుకునేందుకు అనేక రకాల బీమా సదుపాయాలను కూడా ప్రధాన మంత్రి ప్రవేశపెట్టారని, గ్రామీణ ప్రజల ఈపథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తపాలా ఉద్యోగులు అంతా పోస్టాఫీస్ ద్వారా అమలు జరుగుతున్న పథకాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. అనంతరం తణుకు సబ్‌డివిజన్ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన తపాలా ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తణుకు సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.సూర్యప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భీమవరం ఇండియన్ పోస్టు పేమెంట్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మేడపాడులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మేడపాడు హైస్కూల్లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

యలమంచిలి: మండలంలోని మేడపాడు హైస్కూల్లో శనివారం 2010-11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమావేశమయ్యారు. 15 సంవత్సరాల తరువాత కలుసుకున్న తరుణంలో ఒకరి యోగ క్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. చదువుకునే రోజుల్లో జరిగిన ముచ్చట్లను జ్ఞాపకం చేసుకుని సంబరపడ్డారు. ఈ సందర్భంగా వారికి చదువులు చెప్పిన గురువులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయంగా రూ.20 వేలు అందజేశారు.

కిడ్నీ వ్యాధి బాధితునికి ఆర్థిక సహాయం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న బుద్ధరాజు

యలమంచిలి: మొగల్తూరు మండలం కొత్తోట గ్రామానికి చెందిన ఈమన సత్య సూర్య ప్రసాద్ (33)కు రెండు కిడ్నీలు పాడయ్యాయి. వారానికి మూడు రోజులు డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఇతని పరిస్థితిని తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు అతని వైద్యానికి రూ.పదివేల చెక్కును పంపగా వసుధ ఫౌండేషన్ పాలకొల్లు శాఖ కన్వీనర్ పెన్మత్స బుద్ధరాజు శనివారం బాధితునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ మాజీ సర్పంచ్ పైడి రత్నరాజు తమ గ్రామస్తుడికి ఆర్థిక సహాయం చేసినందుకు వసుధ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు



వెలగలవారిపాలెం ధాన్యాన్ని బరకాలతో కప్పిన దృశ్యం



సత్తారామేశ్వరంలో ధాన్యాన్ని ఎగురబోస్తున్న రైతు కూలీలు

పెనుమంట్ర: మండలంలో ధాన్యం కొనుగోళ్ల రైతు సేవా కేంద్రాలలో ఇంకా మందకొడిగా సాగుతున్నాయి. మండలంలో 16 రైతు సేవా కేంద్రాలలో 33,042 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి లక్ష్యంగా నిర్ణయించి తదుపరి దానిని 48,380 మెట్రిక్ టన్నులకు పెంచారు. అయితే తొలుత ఆర్ఎస్‌కేలకు చేరిన సంచులు దళారుల పరం కావడంతో రైతులు సంచుల కొరతతో ఇబ్బందిపడ్డారు. చివరకు జుత్తిగలో రైతులు ఉద్యమం చేస్తేనే గానీ అధికారులు పూర్తి స్థాయిలో సంచులు సరఫరా చేయలేకపోయారు. మండలంలో ఇప్పటి వరకు 39,628 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఏఓ అడబాల జ్యోత్స్న శనివారం తెలిపారు.

వరికోతలు పూర్తయినా..

మండలంలో వరికోతలు పూర్తిఅయినప్పటికీ ఇంకా సుమారు 8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల కళ్లాల్లో ధాన్యం రాశులుగా, బస్తాలుగా దర్శనిమిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల సిబ్బంది, కమిషన్ వ్యాపారస్తులు, మిల్లర్లు కుమ్మక్కై, నాణ్యతా ప్రమాణాలు తూకం తేడాలు తదితర సమస్యలతో రైతు బస్తాకు రూ. 50 నుంచి 100లు నష్టపోవాల్సి వస్తోంది. ఇంకా మాసూళ్లు పూర్తయినా కొందరు రైతులు తమ ధాన్యాలు అమ్మకాలు కాక కమీషన్ వ్యాపారస్తులచుట్టూ తిరుగుతున్నారు. దీంతో స్థానిక రైస్‌మిల్లులో ప్రభుత్వం ఇచ్చిన టార్కెట్‌ను పూర్తి అవడంతో ధాన్యాలు తీసుకోవడం లేదని, దూర ప్రాంతాల్లో రైసుమిల్లులకు తరలించాలంటే అదనపుఖర్చులు రైతులే భరించాల్సి ఉంటుందని అందుకు ఇష్టమైతేనే ధాన్యం తీసుకువెళతామని రైతులను దళారులు మభ్యపెడుతున్నారు. దాంతో ఇంకా ధాన్యం రైతు కళ్లాల్లోనే రాశులు, బస్తాలుగా దర్శనమిస్తున్నాయి.